క్లుప్తంగా

బ్రిడ్జి నిర్మాణానికి రూ. 30 లక్షలు మంజూరు

● దువ్వాడ వాణి చొరవపై హర్షం

సంతబొమ్మాళి: జగన్నాథపురం గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ. 30 లక్షలు డీఎంఎఫ్ నిధులు మంజూరు అయ్యాయి. వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి చొరవతో నిధులు మంజూరు అవ్వటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వర్షాలకు గత నెల 26వ తేదీన బ్రిడ్జి కూలిపోవడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలిసిన వెంటనే దువ్వాడ వాణి అధికారులతో సంఘటన స్థలాన్ని పరిశీలించి బ్రిడ్జి నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయిస్తాని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 30లక్షలు డీఎంఎఫ్ నిధులను మంజూరు చేయించారు.

కొత్తపింఛన్ల పంపిణీ

కవిటి: డిగొనపపుట్టుగ పంచాయతీ పలువురికి మంజూరైన కొత్త పింఛన్లను స్థానిక సర్పంచ్ బెందాళం కిరణకుమారి, ఎంపీటీసీ సభ్యుడు చందాన పూర్ణచంద్రుడు శనివారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పింఛన్ లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పెద్దబొడ్డపాడులో..

వజ్రపుకొత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే వివక్షత లేని సంక్షేమ పాలన సాధ్యమని సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు అన్నారు. పెద్దబొడ్డపాడు గ్రామ సచివాలయంలో శనివారం కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. సీతాపురం గ్రామానికి చెందిన జన్మభూమి కమిటీ సభ్యుడు తమ్మినాన గోపాలరావు, కొల్లిపాడు గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ అధ్యక్షుడు కె.వాసుదేవరావుకి పింఛన్ అందించారు. పంచాయతీ కార్యదర్శి దామోదర్, గ్రామ సచివాలయ సిబ్బంది వలంటీర్లు శ్రీకాంత్, ప్రశాంతి, అరుణ, రోహిణి ఉన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: పురపాలక సంఘంలోని 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి అభివృద్ధి పనులు చేసేందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఐదు అంశాలపై సభ్యులు చర్చించారు. రూ. 64,33,642 సాధారణ నిధుల నుంచి 1,93,656 రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు, పట్టణంలో సంచరిస్తున్న కోతులను పట్టుకొని అడవిలో విడిచిపెట్టేందుకు సభ్యులు తీర్మాణం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్, మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణ మణి పాల్గొన్నారు.

ఓజోన్ పొరను పరిరక్షించుకుందాం


కవిటి: చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి: ఓజోన్ పొరను పరిరక్షించుకుదాం...పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కవిటి: ఆధునికత మోజులో పడి ప్రజారోగ్య సహజ రక్షణ కవచమైన ఓజోన్‌పొరను నాశనానికి పాల్పడడం ప్రమాదకర సంకేతమని రాజపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు నినదించారు. ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో శనివారం చైతన్యర్యాలీ నిర్వహించారు.

తొలిపూజకు వేళాయె..


టెక్కలి: చాకిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసిన విద్యార్థులు


వజ్రపుకొత్తూరు రూరల్: వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న హుకుంపేట యువకులు


సోంపేట: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు


కాశీబుగ్గ: నీటిరంగులు ఉపయోగించి అందంగా తీర్చిదిద్దిన విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న పర్యావరణ ప్రేమికుడు రామకుమార్ పండా


కంచిలి: అంపురం పాఠశాలలో తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలతో విద్యార్థులు


మందస: మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసిన కె.నారాయణ పాఠశాల చిన్నారులు


టెక్కలిలో సిద్ధమైన మండపం


టెక్కలిలో కోల్‌కత్తా కళాకారుల చేతుల్లో మట్టితో రూపుదిద్దుకుని అమ్మకాలకు సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు


ఇచ్ఛాపురం: తయారు చేసిన మట్టిప్రతిమలతో మున్సిపల్ ప్రాథమిక పాఠశాల చిన్నారులు

కులమతాలకు అతీతంగా జరుపుకునే పండుగల్లో వినాయక చవితి ఒకటి. తొలిపూజగా భావించి ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ. దీంతో గ్రామాల్లో చవితి సందడి ఆరంభమైంది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల కోసం నిర్వహణ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. మండపాలను కూడా అందంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రధానంగా పూజల కోసం గణనాథుల విగ్రహాలను వివిధ ఆకృతుల్లో సిద్ధం చేశారు. పర్యావరణానికి ముప్పులేకుండా మట్టితో చేసిన బొమ్మలను పూజించేందుకు వీలుగా వివిధ ప్రాంతాల్లో పంపిణీలను కూడా చేశారు. పాఠశాలల్లో విద్యార్థులతో మట్టి వినాయక బొమ్మలను ఉపాధ్యాయ సిబ్బంది తయారు చేయించారు. మండపాల్లో ప్రతిష్టనున్న పెద్ద విగ్రహాలను కళాకారులు రంగులతో సుందరంగా తీర్చిదిద్దే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే మార్కెట్లో విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి.

నవరత్నాలతో నవశకానికి నాంది

● వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సాయిరాజ్
● కొత్తకొజ్జిరియాలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కవిటి:

ప్రజల కష్టాలు తీర్చడమే ధ్యేయంగా నవరత్న పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవశకానికి నాంది పలికారని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. కొజ్జిరియా పంచాయతీ కొత్తకొజ్జిరియా గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాల వారికి వివిధ పథకాల ద్వారా ఏమేరకు లబ్ధి చేకూరిందో వివరించి బ్రోచర్లను అందజేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, యూత్ కన్వీనర్ వై.అశోక్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, ఇచ్ఛాపురం జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఏఎంసీ చైర్మన్ నూతలపాటి బాబూరావు, వైస్‌చైర్మన్ వై.నీలయ్య, సర్పంచ్ నీలు, మురపాల లచ్చయ్య, పిట్ట దేవేంద్రరెడ్డి, దక్కత నూకయ్యరెడ్డి, ఉప్పాడ రాజారెడ్డి, ఇచ్ఛాపురం మండల జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తం, పిట్ట మామయ్య, సనపల కృష్ణ, ఈశ్వరరావు, బదకల భాస్కరరావు పాల్గొన్నారు.


మహిళలకు సంక్షేమాన్ని వివరిస్తున్న సాయిరాజ్

పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలి

● డీఎల్‌పీవో రమణ

టెక్కలి: పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ అన్నారు. టెక్కలి డివిజన్ పరిధిలోని 17 మండలాల్లో గల మేజర్ పంచాయతీల్లో కొన్నిచోట్ల పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉందని, నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. టెక్కలి డీఎల్‌పీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, జూనియర్ సహాయకులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వాహణ సక్రమంగా లేదనే విషయం తమ పర్యటనల్లో బహిర్గతమవుతోందన్నారు. అలాగే పీఎఫ్ఎంఎస్ విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎల్‌పీవో ఐ.వి.రమణ

మంత్రికి భవన నిర్మాణ కార్మికుల వినతి

కాశీబుగ్గ:

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును తన క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు ఆదినారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతి, ఎస్.చంద్రరావు, జి.గోవింద్, దుర్యోధన, డి.గోవింద, మందస, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు..


మంత్రి అప్పలరాజుకు వినతిపత్రం అందిస్తున్న సంఘ ప్రతినిధులు

గృహసారథుల బీమా రిజిస్ట్రేషన్ గడువు పెంపు

కంచిలి: గృహసారథుల బీమా రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు, మున్సిపాల్టీ పరిధిలోని గృహ సారథులు ఇంకా ఎవరైనా నమోదు చేసుకోకపోతే తక్షణమే పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ పింఛన్లు


సోంపేట: పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: అర్హులందరికీ సకాలంలో పింఛన్లు అందజేస్తున్న ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. మాకన్నపురం పంచాయతీలో నూతన పింఛన్లను శనివారం పంపిణీ చేశారు.

బాలిగాంలో రక్తదాన శిబిరం


రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

మందస: బాలిగాంలో గాయత్రి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొర్ల కన్నారావు ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం జరిగింది. శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్న ఈ శిబిరంలో విద్యార్థులు, సమాజ సేవకులు స్వచ్ఛందంగా రక్తాన్ని దానం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ జారీ చేసిన సర్టిఫికెట్లను దాతలకు అందజేశారు. ట్రస్టు ప్రతినిధులు కొంచాడ సురేష్‌కుమార్, మధుబాబు, యు.మోహనరావు, పులారి మోహనరావు, డి.పున్నయ్య, బి.ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

పలాసకు డిగ్రీ కళాశాలను తీసుకురాలేకపోయారు

● గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి అప్పలరాజు


మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు


ఇల్లు ఇప్పించాలని మంత్రి అప్పలరాజుని కోరుతున్న రెయ్య రాంబాయి

కాశీబుగ్గ: అరవై ఏళ్లుగా తాత, తండ్రి ఎమ్మెల్యేగా పరిపాలించి పలాసకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తీసుకురాలేకపోయిన అసమర్థులు గౌతు కుటుంబీకులని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విమర్శించారు. తాను కూడా ఎమ్మెల్యేని అవుతానని కూతురు ఇప్పుడు బయలుదేరుతోందని వ్యాఖ్యానించారు. మున్సిపాలిటీ పరిధి 27వ వార్డులో శనివారం రాత్రి వార్డు ఇన్‌చార్జి సుడియా సురేష్ అధ్యక్షతన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. గౌతు శివాజీతోపాటు అతని నాన్న ఎమ్మెల్యేలుగా పని చేసినా పలాసకు ఒరిగింది ఏమీ లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.50 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మించుకున్నామని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, నాడు–నేడుతో పాఠశాలలు, ఆస్పత్రులకు కొత్త నిర్మాణాలు, ఆధునికీకరణ పనులు జరిగాయన్నారు. రూ.100 కోట్లతో మున్సిపాలిటీలో ఉన్న జంట పట్టణాలకు మంచినీటి సరఫరా, రూ.700 కోట్లతో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందన్నారు. గ్రేడు–3లో ఉన్న మున్సిపాలిటీని గ్రేడ్–2 స్థాయికి తీసుకొచ్చామన్నారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి, నియోజకవర్గంలో రోడ్డు డబుల్‌లైన్‌లుగా మార్చుకున్నామని వివరించారు. ఇందులో కొన్నింటిని ఈనెలాఖరులోగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని వెల్లడించారు. స్థానిక వార్డు ఇన్‌చార్జి సుడియా సురేష్, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్లు బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్‌కుమార్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, మహిళా అధ్యక్షురాలు బోర చంద్రకళ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు బెల్లాల శ్రీనివాసరావు, పట్టణ మున్సిపల్ విప్ దుర్గాశంకర్ పండా, నాయకులు బడగల బళ్లయ్య, శ్రీనివాస్, శిష్టు గోపి, బమ్మిడి సంతోష్, రోణంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇల్లు ఇప్పించండయ్యా..

కాశీబుగ్గ: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఓ రేకు ఇంటి వద్దకు మంత్రి అప్పలరాజు వెళ్లారు. 'మాకు ఇల్లు ఇప్పించండయ్యా' అంటూ రెయ్య రాంబాయి దంపతులు మంత్రిని కోరారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇల్లు రాలేదని ఆవేదన చెందడంతో మంత్రి సచివాలయం అధికారులతో మాట్లాడారు. రేషన్‌కార్డులో టెక్నికల్ సమస్యతో ఎర్రర్ చూపుతుందని తెలియజేయడంతో మంత్రి ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్యను దాటి ఇంటిని మంజూరు చేయాలని అధికారులకు ఆదేశించారు. దీంతో ఆ దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆదిత్యలో పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకురాలు కోరెడ్డి విజయలక్ష్మి రచించిన 'ఆరిజన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజ్ అప్రోచెస్ అండ్ మెథడ్స్'పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. భాష పుట్టుక, దాని ఆవశ్యకత, భాషా విధానం, బోధనా పద్ధతులు, సహజ అవసరాలకు అనుగుణంగా మార్పు చెందే విధానంపై చక్కటి అవగాహన పెంచుకునే విధంగా పుస్తకంలో అంశాలు పొందు పరిచారన్నారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, బీఎస్అండ్‌హెచ్ విభాగాధిపతి ఆర్.శాంతికుమార్ పాల్గొన్నారు.

హక్కు చట్టాలు తెలుసుకోవాలి:

కొత్త ఉత్పత్తులు తయారు చేయాలనుకునే వ్యాపారవేత్తలకు ఆయా ఉత్పత్తులకు సంబంధించిన హక్కు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. కళాశాలకు చెందిన విద్యాంజలి, ఉమెన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థుల కోసం 'క్రియేటింగ్ స్టార్టప్ ఎకోసిస్టమ్ ఇన్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్'అనే అంశంపై ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు. మద్రాస్ యూనివర్సిటీ ఎంబీఏ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.ఎస్.మంజుల నేతృత్వంలో శిక్షణ నిర్వహించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

నందిగాం: కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారు. ఇందులో భాగంగా కాపునేస్తం నిధులను శనివారం మంజూరు చేయడంతో కృతజ్ఞతగా నందిగాం సచివాలయం వద్ద జేసీఎస్ కన్వీనర్ జద్యాడ జయరాం ఆధ్వర్యంలో లబ్ధిదారులు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఏఈ జి.ప్రసాద్ తెలిపారు.

విజ్ఞానాన్ని సంపాదించుకోవాలి

టెక్కలి రూరల్: పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు వీలుగా అవసరమైన విజ్ఞానాన్ని విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలని డిప్యూటీ ఈవో గార పగడాలమ్మ అన్నారు. సీతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాల ప్రదర్శనను శనివారం పరిశీలించారు. హెచ్ఎం ఎస్.వేణికుమారి ఉన్నారు.

చెత్తరహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఇచ్ఛాపురం: చెత్తరహిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. ఇండియన్ స్వచ్ఛతా లీగ్ రెండోదశ కార్యక్రమంలో భాగంగా యూత్‌గార్బేజ్ పేరిట ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి రోడ్లను శుభ్రం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

